
ఆంధ్రజ్యోతి ****
ANDHRAJYOTHY



చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	22.0

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

● యాదాద్రి జిల్లా గుండాల మండలంలో నిందితులను పట్టుకున్న పోలీసులు 6



సెలవులకు టాటా.. నేటి నుంచి బడిబాట





- పాఠశాలలను శుభ్రంచేసి సిద్ధం చేసిన ఉపాధ్యాయులు
- విద్యార్థుల నమోదుకు 'బడి బాట' నిర్వహణ
- ప్రైవేటులో తల్లిదండ్రులకు ఫీజుల తంటా
- అందని బీపీఎస్ నిధులు

వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాసంస్థలను శుభ్రంచేసి సర్వం సిద్ధం చేశాయి. పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించేందుకు మామిడి తోరణాలు, బెలూన్స్‌తో అలంకరించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, కోదాడ, సూర్యాపేటఅర్బన్, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,376 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 2,355, ప్రాథమికోన్నత 290, ఉన్నత పాఠశాలలు 631 ఉన్నాయి. ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 150, ప్రాథమికోన్నత 400, ఉన్నత పాఠశాలలు 550 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 4.5లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 481, ప్రాథమికోన్నత 68, ఉన్నత పాఠశాలలు 163 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 3,465 ఉపాధ్యాయ పోస్టులకు 3,315మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 150 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,693మంది ఎస్జీటీలు, 1,784 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. 160 మంది జీహెచ్‌ఎంలు, 150మంది ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో సుమారు 1,484 ప్రభుత్వ,350 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.ఎక్కువమంది విద్యార్థులు ఉండి తక్కువమంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలకు తక్కువమంది విద్యార్థులు ఉండి ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేయనున్నారు.

విద్యార్థుల సంఖ్య, ప్రమాణాలు పెంచేందుకు

ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుండటంపై అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థుల నమోదుకు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా గత ఏడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచితే ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కూడా పూర్తయింది. మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు పాఠశాలల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు తాజాగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, స్కావెంజర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలలకు నూరుశాతం యూనిఫాం,పుస్తకాలు, నోట్ బుక్స్ చేరగా,వాటిని పాఠశాలల పునఃప్రారంభం రోజే పంపిణీచేయనున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 5,89,970 పుస్తకాలు పాఠశాలలకు చేరాయి. గత విద్యా సంవత్సరంలో చదువులో వెనుకబాటుతనాన్ని గుర్తించిన ప్రభుత్వం, ఈ విద్యా సంవత్సరంలో దా న్ని అధిగమించేందుకు 60రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనుంది. చదవడం, రాయడంలో సామర్థ్యాల పెంపు, ప్రతీ రోజు సాయంత్రం పాఠశాల ముగియగానే గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

సమస్యల తిష్ట

సూరాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2లో తరగతి గదుల్లో సరైన వెలుతురు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చివ్వెంల మండలంలోని తిమ్మాపురం, వల్లభాపురం, గుంజలూరు ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. నూ తనకల్ మండలంలోని తాళ్ల సింగారం, పెద్దనెమిల, మద్దిరా ల మండలంలోని గోరెంట్ల, చిననెమిల ప్రాథమిక పాఠశాల లు అధ్వానంగా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్), కోదాడ నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు లేవు. మరికొన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ

మిగతా 7వ పేజీలో..



తల్లిదండ్రులకు ఫీజుల తంటా

తల్లిదండ్రులు కుటుంబ బడ్జెట్‌లో ఎక్కువ భాగం పిల్లల చదువుకోసం ఖర్చు చేసే పరిస్థితి ఉంది. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు, షూ, ట్రంక్‌పెట్టెలు ఇప్పటికే తీసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజులు నిర్ణయించాయి. ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు, షూ ధరలు ఏటా పెరుగుతుండటంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. కార్పొరేట్ పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థిపై రూ.1.25లక్షలు, బడ్జెట్ పాఠశాలల్లో రూ.50వేలు, హాస్టల్‌కు అదనంగా మరో రూ.50వేల వరకు ఖర్చు వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బస్సుల ఫిట్‌నెస్ ఎంత?

ఉమ్మడి జిల్లాలో సుమారు 900 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఆయా పాఠశాలలు సుమారు 674 బస్సులు నడుపుతున్నాయి. అందులో 30శాతం బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండగా, 25శాతం పాఠశాలలకు మాత్రమే అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్ ఉన్నట్లు సమాచారం. పాఠశాల బస్సులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. వాటిని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాటించాల్సి ఉంది. అయితే ఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పూర్తి కాని 'మన ఊరు, మన బడి' పనులు

గత ప్రభుత్వం 'మన ఊరు, మన బడి' కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించింది. మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణాలు పూర్తయినా, నిధులు విడుదల కాకపోవడంతో ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్,పెయింటింగ్ పనులు నిలిచాయి. యాదాద్రి జిల్లాలో గత ఏడాది 'అమ్మ ఆదర్శ పాఠశాల' కింద జిల్లాలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించగా, ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు కొన్ని ఇబ్బందులు తప్పనున్నాయి. గతఏడాది జిల్లాకు రూ.25కోట్లు మంజూరు చేసింది. వీటితో 3,192 పనులు నిర్వహించారు. మైనర్ రిపేర్లకు 651పనులు, తాగునీటికి పను లు 472, విద్యుత్ సంబంధిత పనులు 754, మరుగుగొడ్ల మరమ్మతులు 1,251, నూతనంగా బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణాలు 58 వరకు చేపట్టారు. ఇంకా కొన్ని పనులకు పాఠశాలల నుంచి రూ.3కోట్ల వరకు ప్రతిపాదనలు విద్యాశాఖకు రాగా,నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించింది.





మూడో శనివారం ఉండదు భారం

- పాఠశాలల్లో నోబ్యాగ్‌డే
- విద్యార్థులకు ఊరట

విద్యార్థులకు పుస్తకాల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో నో బ్యాగ్‌డే అమలుకు నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా మూడో శనివారం నోబ్యాగ్‌డేను అమలుచేయనుంది.

7 - (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

బాలకార్మిక వ్యవస్థ సజీవంగానే..

- శ్రమ దోపిడీకి గురవుతున్న చిన్నారులు
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం



కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పలువురు చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తున్నా బాలకార్మిక వ్యవస్థ సజీవంగానే ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 20వేల మందికి పైగా బాలకార్మికులు ఉన్నట్లు ఓ అనధికార అంచనా. ఈ వ్యవస్థను సమూలంగా రూపుమాపాలని పలువురు విద్యా నిపుణులు కోరుతున్నారు.

6 - (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పోచంపల్లికి నేడు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



పోచంపల్లిలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి,జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల తయారీ కేంద్రం భూదాన్‌పోచంపల్లిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం సందర్శించనున్నారు. గవర్నర్ ఇక్కడి టూరిజం పార్క్‌ను సందర్శించి 30 మంది చేనేత కార్మికులు, కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతతో ముఖాముఖి నిర్వహిస్తారు. చేనేత కార్మికుల గృహాలను సైతం సందర్శించి మగ్గాలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకుంటారు.

గవర్నర్ పర్యటన ఇలా..

ఉదయం 10.30 గంటలకు పోచంపల్లి చేరుకుంటారు. 11 గంటల వరకు పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శిస్తారు. 11.15 గంటల నుంచి 11.45 వరకు చేనేత కార్మికులు, కళాకారులకు టూరిజం పార్క్‌లో ముఖాముఖి నిర్వహిస్తారు. 12 గంటల వరకు అక్కడే చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. అనంతరం లబ్ధిదారులకు 'నేతన్న బీమా' చెక్కులను పంపిణీ చేస్తారు.

రైతులు రశీదు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



నార్కట్‌పల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విధిగా రశీదు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులను డీలర్లు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డీలర్ల వద్ద రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట ఏవో గౌతమ్ ఉన్నారు.

టీజీఎండీసీ ద్వారానే ఇసుక సరఫరా

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ద్వారానే సరఫరా చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు,ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనుల వారీగా సంబంధితశాఖల ఇంజనీరింగ్ అధికారులు జాబితాలను సమర్పించాలన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ఇకపై టీజీఎండీసీ ద్వారా మాత్రమే సరఫరా చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుంచి నేరుగా ఇసుకను తీసుకోవద్దని, అవసరమైన ఇసుకకు ముందే అనుమతులు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా ఇసుక లభ్యమయ్యే వనరులను మైనింగ్‌శాఖ జాబితా సమర్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎంత ఇసుక అవసరమో అంతే వినియోగించాలని, పరిమితికి మించి ఇసుకను వినియోగించవద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, జిల్లా మైనింగ్ అధికారి శామ్యూల్ జాకబ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ రాజ్‌కుమార్, ఇరిగేషన్ అధికారి నాగార్జున, వైటీపీఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్నా ప్రభుత్వ భూముల పట్టా కుదరదు

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కబ్జాలో ఉన్నంత మాత్రాన ప్రభుత్వ భూమిని పట్టా చేయడం కుదరదని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా, విక్రయించినా నేరమన్నారు. బుధవారం




నార్కట్‌పల్లి అంగన్‌వాడీ-1 కేంద్రంలో చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మండలంలోని ఏపీలింగోటంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే గ్రామంలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు స్థలం కొరత ఏర్పడి గ్రామస్థులే నష్టపోతారని చెప్పారు. శాలిగౌరారం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి స్థలం దొరకని పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ ఉదహరించారు. పైసా ఖర్చులేకుండా భూ వివాదాలను పరిష్కరించుకునే వేదికగా భూ భారతి చట్టం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకొని వాటికి సమాధానం చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, రెవెన్యూ ఉద్యోగులు యాదయ్య, దొడ్డి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

గ్రామాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1 కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. 'అమ్మ మాట, అంగన్‌వాడీ బాట'లో భాగంగా చిన్నారుల నమోదును పరిశీలించారు. కేంద్రంలోని చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారితో పద్యాలు (రైమ్స్) చదివించి చాక్లెట్లు అందజేసి చిన్నారులతో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగానే బడిగంటను మోగించి బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడ్డుతోకూడిన బిర్యానీ అందజేసే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకొని ప్రతి నెలా క్రమం తప్పకుండా పీహెచ్‌సీల్లో నిర్వహించే ఏఎన్‌సీలకు వెళ్లాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్‌డబ్ల్యూవో కృష్ణవేణి, ఐసీడీఎస్ సీడీపీవో అస్రఅంజుమ్, ఎంపీవో సుధాకర్, సూపర్‌వైజర్ సరిత, అంజమ్మ, ఏఎన్‌ఎం నాగమణి, తదితరులు ఉన్నారు.

'భూభారతి'తో భూసమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వేములపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'భూభారతి' చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున, రైతులు భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మొల్కపట్నం గ్రామంలో 61 దరఖాస్తులు అందాయని, మండల వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 493 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని, ఈ నెల 20వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో విచారించి 13-బీ జారీ చేస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, డీటీ కోటేశ్వరి, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, జూనియర్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.



7

ప్రజాప్రభుత్వంలోనే అన్నివర్గాలకు న్యాయం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్

నల్లగొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కింద ఈ ఏడాది జిల్లాలో 68,70,800 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 39,51,700 మొక్కలు, వ్యవసాయశాఖ 7.66లక్షలు, ఉద్యానశాఖ 6.38లక్షలు, మున్సిపాలిటీలు 8.20లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అధికారులు వారి లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ, వనమహోత్సవం మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించడమేగాక జియో ట్యాగింగ్ చేయాలని, నర్సరీలను మ్యాచింగ్, బ్యాచింగ్ చేయాలని, ప్రముఖులు మొక్కలు నాటేందుకు ఒక వీఐపీ స్థలాన్ని గుర్తించాలన్నారు. మొక్కలు నాటే విషయంలో సాంకేతికత, సూచనలను అటవీశాఖ ఎప్పటికప్పుడు అందిస్తుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి శ్రవణ్, ఎక్సైజ్ అధికారి సంతోష్, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మెనూను సక్రమంగా అమలు చేయాలి

డీటీడీవో ఛత్రునాయక్



వసతి గృహంలోని వంట గదిని పరిశీలిస్తున్న డీటీడీవో ఛత్రునాయక్

పెద్దవూర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో భోజన మెనూను సక్రమంగా అమలు చేయాలని డీటీడీవో ఛత్రునాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, ఎస్సీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతిగృహంలోని వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా సిబ్బంది పాఠశాలను, వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్టళ్లలో వసతి పొందేందుకు విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● ఏరువాక సాగారో..



జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏరువాక పౌర్ణమిని రైతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లిలో కొందరు రైతులు పత్తి విత్తనాలు విత్తారు.

రైతన్న సాగు సంబురం


దున్నకానికి సిద్ధం చేస్తూ..


ట్రాక్టర్‌తో దున్నుతూ..



కోటి ఆశలతో అన్నదాతలు సాగుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో దుక్కులు దున్ని భూములను చదును చేసుకుంటున్నారు. ఏరువాక పౌర్ణమి రైతులకు శుభదినం కావడంతో సాగు సంబురానికి నాగలి పట్టి కదిలారు. వరి పొలాలు, నాగళ్లతో దున్ని పత్తి విత్తనాలు కూరగాయలు వేరుశనగ విత్తనాలు వేస్తున్నారు. రుతుపవనాలు ముందు వచ్చిన వర్షాలు ఆశాజనక లేకపోవడంతో కొంతమంది రైతులు మంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రోజు ఏరువాక కావడంతో రైతులు పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. అదేవిధంగా రైతు పనిచేసే కూలీలకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది.

● (ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ నల్లగొండ)






సిద్ధమైన వరి నారు


డిండిలో ఎడ్లబండ్లతో ఊరేగింపు చేస్తున్న రైతులు

సన్నబియ్యం పక్కదారి

దేవరకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం జూన్ నెలలోనే వచ్చే మూడు నెలల బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేస్తోంది. నల్లగొండ జిల్లా దేవరకొండలో కొందరు డీలర్లు గతంలో మాదిరిగానే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. వినియోగదారులు సైతం బియ్యాన్ని రూ.15 నుంచి 16వరకు వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యాన్ని డీలర్లు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ సన్న బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. తాజాగా సన్నబియ్యం దేవరకొండ డివిజన్‌లో 30 క్వింటాళ్ల వరకు పట్టుబడడం ఇదే మొదటిసారి. పాత్లావత్ తండాకు చెందిన మధు బొలేరో వాహనంలో 30 క్వింటాళ్ల వరకు రేషన్‌బియ్యాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తివైపు తరలిస్తుండగా దేవరకొండ సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడమే రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. దేవరకొండ డివిజన్‌లోని ప్రధాన గోదాం నుంచి ప్రతినెలా 232 రేషన్ దుకాణాలకు 10వేల క్వింటాళ్ల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. పీడీయాక్టువంటి చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడమే రేషన్‌బియ్యం పక్కదారి పట్టడానికి కారణమని ప్రజలు తెలుపుతున్నారు. రేషన్‌బియ్యాన్ని పక్కదారిపట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ తెలి పారు.

30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

దేవరకొండ నుంచి కల్వకుర్తివైపు బొలేరో వాహనంలో తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి వద్ద బుధవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అటుగా వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 30 క్వింటాళ్ల వరకు సన్న రేషన్‌బియ్యాన్ని గుర్తించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పాత్లావత్‌తండాకు చెందిన పాత్లావత్ మధును అరెస్ట్ చేసి దేవరకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని దేవరకొండ డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్‌కు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

చౌటుప్పల్ రూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో జరిగింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గండికోట శేఖర్(32) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5న బాత్రుమ్‌లో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య గండికోట కస్తూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్సులో మరిచిన బ్యాగు అప్పగింత


బస్సులో మర్చిపోయిన బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

దేవరకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బస్సులో మరిచిన బ్యాగును డ్రైవర్, కండక్టర్ ప్రయాణికురాలికి అప్పగించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ బస్సులో బుధవారం ప్రయాణికురాలు లక్ష్మీ చింతపల్లిలో బస్సు ఎక్కి హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో దిగి బ్యాగును మర్చిపోయింది. గమనించిన కండక్టర్ యాదయ్య, డ్రైవర్ నజీరొద్దిన్ ప్రయాణికురాలు బస్సులో బ్యాగును తెరిచి చూడగా అందులో బంగారు చెవి రింగులు, రూ.650 నగదు, ఇతర పత్రాలు ఉన్నాయి. ఆ బ్యాగును భద్రపరిచి దేవరకొండ డిపోలో అధికారులకు అప్పగించారు. సాయంత్రం బ్యాగును పోగొట్టుకున్న మహిళా ప్రయాణికురాలు తిరిగి డిపో వద్దకు చేరుకోగా విచారించి బ్యాగును ఆమెకు అప్పగించారు. ప్రయాణికురాలికి బ్యాగు అప్పగించిన డ్రైవర్, కండక్టర్‌ను దేవరకొండ డిపో మేనేజర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ సైదులుగౌడ్ అభినందించారు.

బడి కోసం యువకుల ప్రచారం

ఆత్మకూరు(ఎం), జూన్ 11: (ఆంధ్రజ్యోతి) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి దాని మనుగడను కాపాడాలని యువకులు నడుం బిగించారు. సూర్యాపేట జిల్లా వఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లిలో గ్రామ యువకులు బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి తలిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు.


పిల్లలను మన ఊరి బడికి పంపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం రాయిపల్లిలో ప్రచారం చేస్తున్న యువకులు

చట్టాలు ఎన్ని ఉన్నా..



(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తున్నా ఆ వ్యవస్థ ఇంకా సజీవంగా ఉంది. కుటుంబ ఆర్థికస్థితిగతులు, అవగాహనా రాహిత్యం, ప్రభుత్వ వ్యవస్థల నిఘాలోపం, నిరక్షరాస్యత అన్నింటికీ మించి పిల్లలతో తక్కువ వేతనానికి ఎక్కువ పనితనం అన్న కొద్దిమంది స్వార్థమే ప్రధానకారణాలుగా పిల్లల హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. అలాగే బాల్యవివాహాలు, కూడా పరోక్ష కారణాలంటున్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 20వేల మందికి పైగా బాల కార్మికులు ఉన్నట్లు ఓ అనధికార అంచనా.

బాల కార్మికులు అధికంగా ..

బాలలు అధికంగా హోటల్స్, దుకాణాల్లో పనిచేస్తున్నారు. కానీ దూరంగా ఉండే పారిశ్రామిక వాడలు, ఇటుక, బొగ్గు బట్టీలలో వారి జీవితాలు మగ్గుతున్నాయి. పలువురు అనాథ పిల్లలు రహదారుల వెంట చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుతూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిమంది ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలు, ఫాంహౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాల వద్ద పనులు చేస్తున్నారు.

ఫలించని ప్రయత్నాలు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఏడాది జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం థీమ్‌గా 'మన హామీలను కార్యరూపంలోకి తీసుకెళ్దాం- బాలకార్మిక వ్యవస్థను అంతమొందించుదాం' పేరిట ఏడాది పొడవున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే బాల కార్మికుల గుర్తింపు, న్యాయం చేసే లక్ష్యంగా పలు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రతీ జూలైలో ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తుంటారు. కానీ పలువురి ఒత్తిడి, బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్న యాజమాన్యాలు కోర్టుల్లో వేస్తున్న కేసుల ఫలితంగా అధికారులు ఆపరేషన్స్‌ను నామమాత్రానికే పరిమితం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఐదేళ్లలో కేవలం 366మంది బాలకార్మికులను మాత్రమే గుర్తించారని పలువురు అంటున్నారు.

బాధ్యతలను విస్మరిస్తున్నవారే అధికం

పిల్లల హక్కులు, భవిష్యత్, భద్రతను విస్మరిస్తున్న ప్రజలే అధికంగా ఉన్నారని ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేలో తేలింది. మూడు అంశాలపై బుధవారం జిల్లా వ్యాప్తంగా 50 మందిని ఆరా తీయగా ఇందులో అత్యధికులు బాలకార్మికులు కనిపించినా తాము 1098 నెంబరుకు సమాచారం ఇవ్వలేమని 29 మంది తేల్చిచెప్పారు.

ఆంధ్రజ్యోతి సర్వే

బాల కార్మికులు కన్పిస్తే 1098కు సమాచారం ఇస్తారా?

ఇవ్వలేము	29మంది
అవగాహన కల్పిస్తాం	12మంది
స్వచ్ఛందంగా ఆ పని చేస్తాం	9 మంది

రెండేళ్ల వరకూ జైలు...

బాలకార్మిక (నిషేధం, నియంత్రణ)సవరణ చట్టం 2016 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను ఎలాంటి పనుల్లో నియమించుకోరాదు. 14-18ఏళ్ల లోపు పిల్లలతో ప్రమాదకర పనులను చేయించరాదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 20వేల నుంచి రూ. 50వేల జరిమానా విధించబడుతుంది.

● దుష్పరిణామాలు

బాలకార్మిక వ్యవస్థతో పిల్లలో పలు దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి. శారీరక, మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. బడి ఈడు పిల్లలు పాఠశాలలకు పోకుండా పనుల పేరిట పక్కదారి పడుతున్నారు. వారి భవిష్యత్ ప్రశ్నార్థక మవుతోంది. శ్రమ దోపిడీకి గురవుతున్నారు. బాల్య దశలోనే మద్యం, డ్రగ్స్, పొగ, గుట్కా, అసాంఘిక కార్యకలాపాలకు గురవుతున్నారు. నేర ప్రవృత్తివైపు మళ్లుతున్నారు. ఉమ్మడి నల్లగొం డ జిల్లాలో 238 జువైనల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) కేసులు నడుస్తుండటం నేర ప్రవృత్తి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా మహిళా బాల కార్మికులు పని ప్రదేశాల్లో లైంగిక దాడులకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అలాగే పరోక్షంగా బాల్య వివాహాలకు కూడా కారణమవుతోంది. ఐదేళ్లుగా జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్, స్మైల్‌లో 51మంది బాలికలకు, 315మంది బాలురకు మొత్తంగా 366 బాల కార్మికులకు విముక్తి కల్పించారు. 53మంది పిల్లలను పాఠశాలలో చేర్పించగా మిగితా వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. 72మంది యజమానులపై కేసు నమోదు చేశారు. అలాగే రెండేళ్లుగా చైల్డ్ లైన్ 1098 నెంబరుకు 104 ఫోన్‌కాల్స్ రాగా అధికారులు ఎక్కువ మంది పిల్లలను కాపాడారు. రెండేళ్లలో 32 బాల్య వివాహాలను అడ్డుకున్నారు.

● అమ్మనాన్న బాటలోనే మేము

మాది భువనగిరికి వలసవచ్చిన కుటుంబం. మా అమ్మ,నాన్న మురికి కాల్వలు, రహదారుల వెంట ఇనుప, అట్టముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుతూ విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. విక్రయాలతో వచ్చే మొత్తంతో మొదటగా చీప్‌లిక్కర్ కొనుగోలు చేసి తాగుతారు. చెత్తకుప్పలలో దొరికే ఆహార పదార్థాలతో కడుపు నింపుకుంటారు. నిత్యం మద్యం మత్తులో తగువులాడుతూ రహదారుల పక్కనే నివాసముంటారు. దీంతో 10 ఏళ్లలోపు వయసు ఉన్న అన్నాచెల్లెళ్లమైన మేము కూడా అదే దారిలో వెళ్తున్నాం. అమ్మా, నాన్న పోట్లాటలు మాకు ఆనందంతో పాటు విషాదాన్ని పంచుతున్నాయి. మద్యం మత్తులో పడుకునే వారి ఆకలి తీర్చేందుకు మేము వ్యర్థాలను ఏరి విక్రయించి వచ్చే మొత్తంతో అన్నం లేదా, ఇతర పదార్థాలను కొనుగోలు చేస్తుంటాం. మా ఈడు పిల్లలు అమ్మా, నాన్నతో వాహనాలపై వెళ్తుండటం, బడికి పోతుండటం చూసి క్షోభకు గురవుతాం.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

● ఏడు గంటల్లోనే ఛేదించిన పోలీసులు ● కిడ్నాప్‌కు పాల్పడిన ఇద్దరు మహిళల అరెస్టు


బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

నల్లగొండ టౌన్, గుండాల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కిడ్నాప్‌కు గురైన 20 నెలల బాలుడిని ఏడు గంటల్లోనే పోలీసులు రక్షించారు. బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన బైరం భాగ్యలక్ష్మికి అనారోగ్యంతో ఉండటంతో ఈ నెల 8వ తేదీన ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆమెతోపాటు అదేరోజు భర్త అంజిబాబు, 20 నెలల వయస్సున్న కుమారుడు సామేశ్వర్‌కుమార్, బంధువు పార్వతమ్మతో వచ్చారు. వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ అయిన అంజిబాబు స్వగ్రామానికి వెళ్లగా, కుమారుడు, బంధువు భాగ్యలక్ష్మి వద్ద ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం భాగ్యలక్ష్మి తన కుమారుడు, పార్వతమ్మతో ఆస్పత్రి ఆవరణలో ఉండగా, అక్కడికి వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని మహిళలు వారితో మాటలు కలిపారు. చిన్నారిని ఆడిస్తూ భోజనం చేసి రావా లని, అప్పటివరకు పిల్లాడిని పట్టుకుంటామంటూ నమ్మబలికారు. దీంతో వారు బాలుడిని ఆ మహిళలకు అప్పగించి భోజనానికి వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత ఇద్దరు మహిళలు, కుమారుడు కనపడకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు బృందాలుగా ఏర్పడిన పోలీసులు ఆస్పత్రిలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఆర్టీసీ బస్టాండు, లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. సమాచారం సేకరించి సాంకేతిక పరిజ్ఞానం సాయంతో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామం వద్ద ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న బాలుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు.

మగ సంతానం కావాలనే కోరికతోనే...

హైదరాబాద్‌లోని దమ్మాయిగూడకు చెందిన నారాయణదాసు, అరుణకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం అరుణ కుమారుడు మృతిచెందాడు. దీంతో ఆమె తమకు మగపిల్లాడు కావాలని, ఒక బాలుడిని తీసుకుని వచ్చి పెంచుకోవాలని ఉందని దమ్మాయిగూడలో తాను నివసిస్తున్న ఇంటి పక్కనే ఉన్న జంతిక సుక్కమ్మ అలియాస్ పాలడుగు సుగుణమ్మకు చెప్పింది. దీంతో అరుణ, సుగణమ్మ రద్దీగా ఉండే ప్రాంతాలైన బస్టాండ్లు, ఆస్పత్రుల్లో పిల్లలు దొరికే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అక్కడినుంచి పిల్లవాడిని కిడ్నాప్ చేసి ఎవరికీ తెలియకుండా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడువుగా వారిద్దరూ మంగళవారం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి అక్కడ ప్రసూతి విభాగం ముందు బాలుడి తల్లి, వారితో వచ్చిన పార్వతమ్మతో మాటలు కలిపారు. బాలుడిని ఆడిస్తున్నట్లు నటిస్తూ భోజనం చేసిరావాలని, తాము చిన్నారిని ఆడిస్తామని నమ్మించారు. వారిద్దరూ భోజనానికి వెళ్లగా బాలుడిని తీసుకుని అక్కడినుంచి పారిపోయారు. డీఎస్పీ శివధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడు గంటల్లో కేసును ఛేదించిన టూటౌన్ సీఐ రాఘవారావు, నా ర్కట్‌పల్లి సీఐ నాగరాజు, టూటౌన్ ఎస్‌ఐ ఎర్ర సైదులు, సతీష్ , భువనగిరి టౌన్ సీఐ రమేష్, సిబ్బంది సాగర్ల శంకర్, బాలకోటి, జానకిరామ్, తిరుమలేష్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


మాదాపూర్‌లో విత్తన విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ పద్మావతి, ఇతర అధికారులు

తుర్కపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే ప్రభుత్వపరంగా కఠినచర్యలు ఉంటాయని ఆలేరు ఏడీఏ పద్మావతి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు మాదాపూర్ గ్రామంలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వ రిజిస్టర్ల తనిఖీచేశారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన దుకాణాల్లోనే రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తుర్కపల్లి, మోత్కుర్ వ్యవసాయాధికారులు, ఏఎస్‌ఐ ఉన్నారు.

రైతులు రశీదు తీసుకోవాలి

బొమ్మలరామారం : విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని ఆలేరు వ్యవసాయ సహాయ డైరెక్టర్ పద్మావతి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలకేంద్రంతో పాటు, చీకటిమామిడి గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలోని స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్‌ల రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో దుర్గేశ్వరీ, తనిఖీ బృందం పూజ, కీర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఈ-పాస్ ద్వారానే విక్రయాలు చేపట్టాలి

కొండమల్లేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈ-పాస్ యంత్రాల ద్వారానే విత్తనాలు, ఎరువులు విక్రయాలు చేపట్టాలని నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల వ్యవయాధికారి వై.జానకిరాములు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్‌కే గౌస్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లిలో ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని సూచించారు. తనిఖీల్లో ఏఈఈ సుభాష్, హెడ్‌కానిస్టేబుల్ నరసింహారెడ్డి, హమీద్, ఏఈవోలు నరేష్, మల్లేష్, డీలర్లు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

నాగారం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా నాగారం బంగ్లా గ్రామానికి చెందిన పురుగు మందుల డీలర్ దోమల వెంకన్న బైక్‌పై వర్ధమానుకోట నుంచి మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో తన ఇంటికి వెళుతుండగా, నాగారం క్రాస్‌రోడ్డ వద్ద నేషనల్ హైవే పై సూర్యాపేట నుంచి జనగాం వెళుతున్న ఏపీ 09 ఎక్యూ 0099 నెంబరు గల కారు అదుపుతప్పి ఢీకొంది. బైక్‌పై నుంచి రోడ్డుపై పడి తీవ్రగాయాలైయ్యాయి. చికిత్స కోసం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వెంకన్నకు భార్య, కమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాజీ సర్పంచ్ మృతి

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం తక్కళ్లపహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వజ్జే బిక్షమయ్య(55) శాలిగౌరారం మండలకేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామం తక్కళ్లపహాడ్‌కు బైక్‌పై వెళ్తుండగా వద్దిపాముల సమీపంలో తక్కళ్లపహాడ్ నుంచి పెర్కకొండారం గ్రామానికి బైక్‌పై వస్తున్న గంట వీరయ్య ఢీ కొన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బిక్షమయ్యను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన గంట వీరయ్యను నార్కెట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వజ్జే బిక్షమయ్య తక్కళ్లపహాడ్ గ్రామానికి 2006 నుంచి 2012వరకు సర్పంచ్‌గా పనిచేశారు. బిక్షమయ్య అకాల మరణం పట్ల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కాంగ్రెస్ నాయకులు కట్టంగూరి సురేందర్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

లారీని వెనుక నుంచి ఢీకొని..

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మండలకేంద్రం శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నార్కట్‌పల్లికి చెందిన కొండ నాగరాజు(37) నల్లగొండలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి తన బైక్‌పై నల్లగొండకు వెళ్తూ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ప్రమాదవశాత్తు ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా ఆసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. నాగరాజు భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరమ్మతులు చేస్తుండగా ట్రాక్టర్ మీదపడి..


నరేష్ (ఫైల్)

శాలిగౌరారం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీ కిందపడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం తుడిమిడి సమీపంలోని మూసీ నది రీచ్‌లో బుధవారం జరిగింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన గిరిగాని నరేష్ (30) తన సొంత ట్రాక్టర్‌తో తుడిమిడి మూసీ నది ఇసుక రీచ్ నుంచి స్యాండ్ టాక్స్ విధానంతో ఇసుక బుక్ చేసుకున్న వివిధ గ్రామాలకు ప్రజలకు తీసుక వెళ్తాడు. ఈ క్రమంలో బుధవారం ఇసుకను తుడిమిడి మూసి నది రీచ్‌లో ట్రాక్టర్ ట్రాలీలో ఇసుక కూలీలు నింపారు. రీచ్ నుంచి ట్రాక్టర్ బయటకు వస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ ఆగిపోయింది. వెంటనే నరేష్ ట్రాక్టర్ దిగి చూసే సరికి ట్రాలీ వెనుక టైర్ బేరింగ్ చెడిపోయింది. వెంటనే చిత్తలూరుకు వెళ్లి కొత్త బేరింగ్‌ను తీసుకొచ్చాడు. జాకీ పెట్టి పాత బేరింగ్ తీసి వేసి కొత్త బేరింగ్‌ను అమర్చే క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ నరేష్ మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి ట్రాలీ కింద ఉన్న నరేష్ మృతదేహాన్ని పక్కకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నరేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు


ఆలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తిర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజ వాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామ లింగేశ్వర స్వామికి రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,88,516 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్ వెంకట్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి హుండీని గురువారం కొండ కింద వ్రత మండపంలో ఉదయం 7గంటల నుంచి లెక్కించనున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని వైభవంగా జరిపించారు .అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేధన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

కొండమల్లేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో 9శాతం రిజర్వేషన్లను అందిపుచుకోవాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్యమాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, పోలేని యాదన్న, కొమిరె స్వామి, నల్లా శ్రీకాంత్, పందిరి శ్రీనివాస్ ఉన్నారు.

బాలికల చదువుకు పెద్దపీట

● కళాశాలగా నిడమనూరు కేజీబీవీ అప్‌గ్రేడ్ ● ఈ ఏడాది బీపీసీ, ఎంఎల్‌టీ రెండు సెక్షన్లు మంజూరు ● 80 మంది బాలికలకు ప్రవేశాలు



నిడమనూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాలికల్లో అక్షరాస్యతను మరింతగా పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మండలంలోని బాలికలకు పై చదువులు చదివేందుకు దోహదం చేస్తుంది. ఇప్పటికే మోడల్ స్కూల్‌లో ఇంటర్ తరగతులు ఉండగా, ఈ ఏడాది కేజీబీవీలో కూడా ఇంటర్ తరగతుల్లో ప్రవేశాలు తీసుకోనున్నారు. కేజీబీవీలో ఈ ఏడాది మొదటగా బీపీసీ, ఎంఎల్‌టీ రెండు సెక్షన్లు మాత్రమే మంజూరు చేసింది.

బాలికల పై చదువులకు అవకాశం

సెక్షన్‌కు 40 మంది బాలికల చొప్పున రెండు సెక్షన్లకు ఈ ఏడాది 80 మంది బాలికలకు కేజీబీవీలో ఇంటర్‌లో చేరేందుకు అవకాశం ఏర్పడింది. కొత్తగా 80 మంది బాలికలకు ఇంగ్లీష మీడియంలో గురుకులం తరహాలో నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్ సౌకర్యం కూడా కల్పించనున్నారు. నిడమనూరు కేజీబీవీని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. బాలికలు పై చదువులు చదివేందుకు చక్కటి అవకాశం కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిడమనూరు కస్తూర్బా పాఠశాలలో గతేడాది 183 మంది బాలికలు విద్యనభ్యసించారు. పదో తరగతిలో 32మంది బాలికలు ఉండగా 31మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలికలకు చక్కటి అవకాశం



నిడమనూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో బాలికల పై చదువులకు చక్కటి అవకాశం ఏర్పడింది. మొదటి సంవత్సరం 80 మంది బాలికలకు ప్రవేశం లభిస్తుంది. కేజీబీవీలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు వసతిగృహ సౌకర్యం కూడా ఉంటుంది. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

● లావూరి వెంకన్న, ఎంఈవో.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీలో ఇంటర్ తరగతులు ఇంగ్లీష మీడియంలో తాత్కాలిక పద్ధతిలో విద్యా బోధన చేసేందుకు గెస్ట్ లెక్చరర్(మహిళా) పోస్టుల కోసం దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. బాలికల్లో అక్షరాస్యతను మరింతగా పెంచేందుకు ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాలను 2009లో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు బాలికలకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యనందిస్తున్నారు. కొన్ని విద్యాలయాలను ప్రభుత్వం గతంలోనే కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. నిడమనూరు కేజీబీవీని ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేసింది.

ప్రజాప్రభుత్వంలోనే అన్నివర్గాలకు న్యాయం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

నల్లగొండ టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల్లో పేదలకు లబ్ధిచేకూరలేదన్నారు. గతంలో అమలు కాని ఎన్నో పథకాలను ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. మంత్రి పదవులతోపాటు, పార్టీ పదవులు కేటాయించడంలో పార్టీ సామాజిక న్యాయం పాటించింద న్నారు. 30ఏళ్ల నుంచి పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణను పూర్తిచేశారని, బీసీ కులగణన చేపట్టారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, మహాలక్ష్మి పథకం, గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ వంటి అనేక పథకాలు పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్నారన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు, మంత్రి పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తోంద న్నారు. తాజాగా నియామకమైన టీపీసీసీ కార్యకవర్గం లోనూ సామాజిక న్యాయమే ఎజెండాగా పార్టీ కోసం కష్టపడిన నాయకులకు చోటు కల్పించారన్నారు. జిల్లాలో ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు ఓసీలకు రాష్ట్రస్థాయి పదవుల్లో చోటుకల్పించారన్నారు. ఎమ్మెల్సీల విషయం లోనూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులకు ఎమ్మెల్సీలుగా పదవులు ఇచ్చిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి, గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీకి చేస్తున్న సేవను దృష్టిలో ఉంచుకొని టీపీసీసి ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, సీనియర్ నేత జానారెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ రఘువీర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏ పదవి ఇచ్చినా, ఏ కార్యక్రమం అప్పజెప్పినా 25 ఏళ్లుగా నిబద్ధతతో పనిచేశానన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన కొండేటి మల్లయ్యను కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, దళిత, ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మవెంకటనర్సమ్మ. నాయకులు గార్లపాటి చంద్రశేఖర్, కోట పుల్లయ్య, భయ్య ముత్తయ్య, వెంకటేశ్వర్లు, మారేపల్లి లక్ష్మీరెడ్డి, కాటేపల్లి దుర్గాప్రసాద్‌గౌడ్, డి. వెంకట్‌రెడ్డి, జి. మోహన్ పాల్గొన్నారు.


టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు-సికింద్రాబాద్ రూట్‌లో ఎలక్ట్రిక్ బస్సులు

మోత్కూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఆర్టీసీ బస్సు డిపోకు ఇటీవల వచ్చిన ఎలక్ట్రిక్ బస్సుల్లో పది బస్సులను సూర్యాపేట నుంచి తిరుమలగిరి, మోత్కూరు, భువనగిరి మీదుగా సికింద్రాబాద్‌కు నడపనున్నట్లు సూర్యాపేట డిపో మేనేజర్ జి. సత్యనారాయణ, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సూర్యాపేట నుంచి ఉదయం 5.00గంటలకు, 6.30, 7.10, 7.50, 8.30, మధ్యాహ్నం 12.30, 1.10, 1.50, 2.30, 3.10గంటలకు బయలుదేరి అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి, మోత్కూరు, భువనగిరి మీదుగా సికింద్రాబాద్ జేబీఎస్‌కు వెళ్తాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 5.00గంటలకు, 5.40, 6.20, 7.00, 7.40, మధ్యాహ్నం 2.30, 3.15, 3.55, 4.35, 5.15గంటలకు బయలు దేరి ఇదే రూట్‌లో సూర్యాపేటకు వెళ్తాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం(మహిళలకు ఉచిత ప్రయాణం) వర్తిస్తుందని తెలిపారు.

ఆయిల్‌పాం సాగు రైతులకు లాభదాయకం

కనగల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగు లాభదాయకమని నల్లగొండ జిల్లా ఉద్యానవనశాఖ అధికారి అనంతరెడ్డి అన్నారు. కనగల్‌లో ఆయిల్‌పాం సాగు గెలల సేకరణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనగల్ మండలంలో మొత్తం 350 ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఆయిల్ పాం సాగు చేస్తున్నారని వివరించారు. ప్రోత్సహించేందుకు ఎస్ఎంపీవోపీ కింద రైతులకు మొక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల పాటు మొక్కల సంరక్షణ కోసం ఎకరానికి రూ.4200లు రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం మొక్కలు అతివృష్టి, అనావృష్టిల్లోనూ పెరుగుతాయని, ఈ పంటకు కోతుల బెడద ఉండదన్నారు. కూలీల ఖర్చులు తక్కువేన్నారు. ఈ మొక్క రైతుల పాలిట కల్ప వృక్షమన్నారు. కార్యక్రమంలో పతంజలి ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ శివాజీ తదితరులున్నారు.


ఆయిల్‌పాం గెలల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి

విద్యార్థులకు ఊరట

● ప్రతి నెలా మూడో శనివారం నోబ్యాగ్ డేకు నిర్ణయం

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్): విద్యార్థులపై పుస్తకాల భారాన్ని కొంత మేరకైనా తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి నూతన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ప్రతినెలా మూడవ శనివారం నో బ్యాగ్‌డేను అమలుచేయనుంది. కొన్నేళ్లుగా ఇష్టానురీతిన పుస్తకాల భారాన్నివిద్యార్థులపై మోపుతున్నారు. వాటిని మోయలేక పసిప్రాయాలు బావురుమంటున్నాయి. పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో అలసిపోయి చదువుకోలేకపోతున్నారు. దీనికితోడు బలహీనంగా ఉండే వారి పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. బాలికలు సైతం కొంత ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో నోబ్యాగ్ డే నిర్ణయంతో విద్యార్థులకు కొంతమేర ఊరట లభించనుంది.

7వ తరగతికి 20 కిలోలు

జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదివే రమేష్ అనే విద్యార్థికి పాఠ్య పుస్తకాలు 6 వరకు ఉన్నాయి. దీనితోడు అదనంగా నోట్ పుస్తకాలు 15 వరకు ఉంటాయి. మొత్తంగా స్కూల్ బ్యాగ్ బరువు 18 నుండి 20 కిలోలు ఉంటుంది. రమేష్ తన బ్యాగును మోసే క్రమంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు.

వెన్నుపూసపై భారం

లేతవయసులో పుస్తకాల భారం వెన్నుపూసపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నిత్యం 18 నుంచి 24 వరకు పాఠ్య, నోట్ పుస్తకాలు మోయలేక అల్లాడిపోతున్నారు. ఇవికాక లంచ్‌బాక్స్, వాటర్ బాటిల్ అదనంగా ఉంటున్నాయి. విద్యార్థి శరీర బరువులో కేవలం 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14 కిలోల బరువు ఉంటే తీసుకెళ్లే బ్యాగ్ నాలుగు కిలోలు ఉండాలి. పిల్లలు స్థాయికి మించి బరువు మోయడంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. అదేవిధంగా చిన్నతనంలోనే వెన్నుపూసలపై భారం పడితే భవిష్యత్‌లో మరింత తీవ్రప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు.

నోబ్యాగ్ డే అమలయ్యేనా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం నోబ్యాగ్ డేను అమలుచేయాలని నిర్ణయించింది. అయితే ఇది విద్యార్థులకు కొంత ఉపశమనం లభించేదే అయినప్పటికీ అమలుకు నోచుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో లాకర్లు ఏర్పాటు చేయాలని, హోంవర్క్ పుస్తకాలను మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చూడాలని సూచిస్తున్నారు.

నోబ్యాగ్ డేను పటిష్టంగా అమలుచేయాలి

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమైన నోబ్యాగ్ డేను ప్రతి మూడవ శనివారం ఖచ్చితంగా అమలుచేయాలి. అదేవిధంగా పుస్తకాల బరువును సైతం తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

- ఆవుల నాగరాజు, విద్యార్థి సంఘ నాయకుడు

ప్రభుత్వ నిర్ణయాన్ని అమలుచేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరానికి తీసుకువచ్చిన మూడవ శనివారం నోబ్యాగ్ డేను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అమలుచేస్తాం. నోబ్యాగ్ డేను విజయవంతం చేసేలా అన్నిచర్యలు తీసుకుంటాం.

- అశోక్‌కుమార్, డీఈవో, సూర్యాపేట జిల్లా

సెలవులకు టాటా..నేటి నుంచి బడిబాట

(5వ పేజీ తరువాయి)

పథకం నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు.

ఉపాధ్యాయులకు అందని బెనిఫిట్స్

విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు మెడికల్, జీపీఎఫ్, పలు రకాల బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులకు ప్రభుత్వం నిధులు విడుదలచేయకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ ఏడాదైనా బెనిఫిట్స్ విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించిన నిధులు సైతం సకాలంలో విడుదల చేయాలని ఏజెన్సీలు కోరుతున్నాయి.

ప్రైవేట్ పాఠశాలలకు అందని బీఏఎస్ నిధులు

ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం బీఏఎస్ (బెస్ట్ అవైలబుల్ స్కీమ్)ను అమలుచేస్తోంది. గత ఏడాది ఈ పథకం కింది ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పాఠశాలలు ఎంపికయ్యాయి. ఎంపికైనా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి డేస్కాలర్ కింద రూ.28వేలు, హాస్టల్ వసతి పొందుతున్న వారికి రూ.42వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే నేటికీ ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేయలేని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి.

పొరపాట్లు అధిగమించి

విద్యార్థులు గత ఏడాది విద్యాభ్యాసంలో చేసిన పొరపాట్లు గుర్తించి, ఈ విద్యా సంవత్సరంలో నూతన తరగతిలో పునరావృత్తం కాకుండా చూసుకుంటే, మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. ఆరు నుంచి పది వరకు నేర్చుకున్న అంశాలే ఇంటర్‌తోపాటు, ఎంసెట్, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో వస్తాయని, గత పొరపాట్లను అధిగమిస్తే సులభంగా రాణించవచ్చని పేర్కొంటున్నారు. 60రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.


పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి.

- అశోక్, డీఈవో, సూర్యాపేట

పుస్తకాలు, యూనిఫాం సిద్ధం



జిల్లాలో పాఠశాలలు ప్రారంభం నాటికే పుస్తకాలు, యూనిఫాంలను సిద్ధంగా ఉంచాం. నూటికి నూరు శాతం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేయనున్నాం. పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు అటు నుంచి పాఠశాలలకు చేర్చాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధిచేస్తున్నాం.

- భిక్షపతి, డీఈవో, నల్లగొండ

యావాపూర్ తండాలో పాఠశాల పునఃప్రారంభం


విద్యార్థుల అడ్మిషన్ తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని యావాపూర్ తండాలోని ప్రాథమిక పాఠశాల నాలుగేళ్ల క్రితం మూతపడింది. దీంతో గ్రామస్థులు పిల్లలను బొమ్మలరామారం మండల కేంద్రం, చీకటి మామిడి, జలాల్‌పూర్, రామలింగంపల్లితో పాటు మేడ్చల్ జిల్లా కీసర గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. మూడు నెలల క్రితం గుడ్ మార్నింగ్ యావాపూర్ తండా అంటూ ఉదయం ఆరు గంటలకే కలెక్టర్ హనుమంతరావు గ్రామస్థులను పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాఠశాలను పునఃప్రారంభించాలని వారు కలెక్టర్‌ను కోరగా, పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని మాట ఇవ్వాలని కలెక్టర్ కోరారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారు 14మంది అడ్మిషన్ తీసుకున్నారు. మొత్తం 30 నుంచి 50 వరకు విద్యార్థులు పాఠశాలకు వెళ్లే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. పాఠశాలను కలెక్టర్ గురువారం పునఃప్రారంభించనుండటంతో భవనానికి రంగులు వేసి ముస్తాబు చేశారు.

పాఠశాల లేక నానా ఇబ్బందులు



గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేనందున ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నా ముగ్గురు పిల్లలను గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నా. గ్రామంలో పాఠశాలను ప్రారంభించడంతో ఈసారి పిల్లలను ఈ పాఠశాలలోనే చేర్పిస్తున్నా. పాఠశాల ప్రారంభంతో నాకు ఆర్థిక భారం తగ్గినట్లయింది.

● మూడావత్ తేజస్‌నాయక్, యావాపూర్ తండా.

మూత'బడి' దిశగా



తిరుమలగిరి(సాగర్) మండలంలోని తునికినూతలతండాలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో మొత్తం 52 పాఠశాలలకు ఇప్పటికే 23 పాఠశాలలు మూతపడ్డాయి. అంతేగాక పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఎర్రచెరువు తండా ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు, చెంచోనితండాలో ఐదుగురు విద్యార్థులు, మూలతండాలో నలుగురు, తెట్టెకుంటలో ఆరుగురు, బట్టువెంకన్నబావితండాలో 11 మంది విద్యార్థులు ఉండగా ఒక టీచర్ చొప్పున ఉన్నారు. ఎల్లాపురంలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, నాయకునితండా 13 ముగ్గురు టీచర్లు, శ్రీరాంపల్లిలో 14, పెద్దబావితండా 17 విద్యార్థులకు ముగ్గురు, నేతాపురంలో 18 మంది, ధన్‌సింగ్‌తండాలో 20మందికి ముగ్గురు టీచర్లు, ఎంపీపీఎస్ నేతాపురంలో 23 మందికి ఒక టీచర్, ఎంపీపీఎస్ సీత్లాతండాలో 22 విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, ఒక వలంటీర్ ఉన్నారు. నాగార్జునపేటతండాలో 14 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు, సుంకిశాలతండాలో 15 మంది విద్యార్థులకు ముగ్గురు, ఎంపీపీఎస్ నేతాపురంలో 23 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, యుపీఎస్ బోయగూడెంలో 26 మందికి నలుగురు టీచర్లు, ఎంపీపీఎస్ జమ్మనకోటలో 27 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉన్నారు. మండలంలో ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో సుమారు 2,600 మంది చేరారు. ఈ ఏడాది ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.


తునికినూతల పాఠశాలలో దారుణంగా మూత్రశాలల పరిస్థితి.

చదువుపై శ్రద్ధ చూపిస్తుండడంతోనే ప్రైవేట్‌కు పంపుతున్నాం



మా పిల్లలను డొక్కలబాయితండాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నాం. పిల్లల చదువుపై పాఠశాల సిబ్బంది, యాజమాన్యం శ్రద్ధ చూపిస్తున్నారు. వివిధ సబ్జెక్టులకు వేర్వేరుగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అందువల్లే మా పిల్లలు ఉన్నత విద్యలో రాణిస్తున్నారు. ప్రభు త్వ పాఠశాలలపై అధికారులు దృష్టి పెట్టి మెరుగుపరచాలి.

- బానావత్ బాలు (విద్యార్థి తండ్రి, గర్కనెట్‌తండా)

ముక్తాపూర్‌లో సినిమా షూటింగ్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఏర్నేని నవీన్, ఎలమంచిలి రవి నిర్మాణ సారథ్యంలో పి. మహేష్‌బాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆంధ్ర కింగ్ తాలుకా' సినిమా షూటింగ్ బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ముక్తాపూర్ గ్రామశివారులో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన సినిమా షూటింగ్ చూసేందుకు మండల ప్రజలు భారీగా తరలి వచ్చారు. భారీ సెట్టింగ్‌లు వేసి సినిమాలోని పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

నేటి మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

చిట్యాలరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం టీఎస్ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ 4వ రీజియన్ మహాసభకు స్టాఫ్, వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రీజియన్ ప్రచారకార్యదర్శి పగిళ్ళ కృష్ణయ్య, రాములు, బాలయ్య, వెంకన్న, వినయ్‌కుమార్, ఎస్‌ఎం. రెడ్డిలు సంయుక్త ప్రకటనలో కోరారు. మహాసభకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, వీరాంజనేయులు హాజరుకానున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలోనిరహదారికి ఇరువైపులా కొత్తగా విద్యుత్ స్థంభాలను వేసేందుకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుఏఈ కే.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి పట్టణంతో పాటు వివేరా హోటల్, వైఎస్ఆర్ కాలనీ, మునుగోడు రోడ్డులో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- చండూరు మునిసిపల్ కమిషనర్ పుష్పలత
- ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన



చండూరు మునిసిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ పుష్పల త అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో మురుగు కాల్వలు, రోడ్డు విస్తరణ పనులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు.

-(ఆంధ్రజ్యోతి,చండూరు)

నలపరాజు సతీష్‌కుమార్ : చండూరు రోడ్డు విస్తరణ పనుల్లో కొలతల్లో తేడా ఎందుకు ఉన్నది. మునిసిపల్ మడిగెల అద్దె వసూల్లో అలసత్వం దేనికి?

కమిషనర్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నాం. అద్దె వసూల్లో ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. స్పందించకుంటే చర్యలు తప్పవు.

కొత్తపాటి సతీష్, ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు

కమిషనర్ : నిబంధనల మేరకు, నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు విస్తరణ చేపడుతున్నాం.

హిమగిరి,2వ వార్డు: పట్టణంలో అనుమతుల్లేకుండా నిర్మాణాలు చర్యలు చేపడుతున్నారు..చర్యలేవి

కమిషనర్: పట్టణ ప్రణాళిక అధికారితో తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

దోటి వెంకన్న,2వ వార్డు: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో డబ్బులు ఇచ్చిన వారినే ఎంపిక చేశారు

కమిషనర్: పారదర్శకంగా ఎంపిక చేశాం. అర్హులైన వారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

దాచేపల్లి ధర్మయ్య, 9వ వార్డు : రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోతున్నాం, ఆదుకోవాలి

కమిషనర్: ఈ విషయం తమ పరిధిలో లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా.

సర్వేశాచారి 10వ వార్డు : మా వార్డులో మురుగు నీరు ఇళ్లలోకి వస్తుంది ?

కమిషనర్ : పట్టణంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా డ్రైనేజీ సమస్య ఏర్పడింది. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

ఐతరాజు మల్లేష్, 9వ వార్డు: మా కాలనీలో దోమల బెడద తీవ్రంగా ఉంది.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

కమిషనర్ : డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో తొలగించి, బ్లీచింగ్ ఫౌడర్ చల్లిస్తాం.

ఇరిగి రామకృష్ణ, 4వ వార్డు : చెత్తను సేకరించే వాహనాలు రావడం లేదు, డ్రైనేజీ అస్తవ్యస్తంగా సమస్య పరిష్కరించరూ

కమిషనర్: చెత్తను సేకరించే వాహనాలు పది వార్డుల్లో కేవలం మూడు వాహనాలు మాత్రమే ఉన్నాయి. సరిపడా లేకపోవడం కారణంగా సకాలంలో చెత్తను సేకరించలేకపోతున్నాం. ఉన్న వాహనాలతో వేగంగా సమస్య పరిష్కరిస్తాం

కళ్లెం సురేందర్‌రెడ్డి, 3వ వార్డు: తహసీల్దార్ కార్యాలయం వీదుల్లో డ్రైనేజీ లేదు,బస్ షెల్టర్ లేదు

కమిషనర్: మురుగు కాల్వల నిర్మాణం నేటికీ లేదని మా దృష్టికి ఇప్పుడే వచ్చింది. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. బస్ షెల్టర్ నిర్మాణానికి ఆర్టీసీ అధికారులకు నివేదిస్తాం.

వైఫల్యాలను అధిగమిస్తే విజయం



సర్టిఫికెట్లు అందిస్తున్న సీఐ మహాలక్ష్మయ్య, మీనయ్య

నల్లగొండ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వైఫల్యాలను అధిగమిస్తే విజయం సాధించవచ్చునని నల్లగొండ ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య అన్నారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను బుధవారం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణనే కాదు ఇతర అవకాశాలను కూడ సేవాభావంతో ఎంవీఎన్ కేంద్రం తన వంతుగా సమాజాభివృద్ధికి సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు 22 వేల మంది విద్యార్థులకు పైగా శిక్షణా పొందారని తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వరా ఇప్పటికే విద్యా, వైద్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తమ సంస్థ కృషిచేస్తుందని అన్నారు. 2011 లో ట్రస్టుని ప్రారంభించిన నాటి నుంచి అనేక దాతల సహకారంతో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కోచింగ్, గ్రంథాలయం నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వహణ కార్యదర్శి నర్సిరెడ్డి, గ్రంథాలయ ఇన్‌చార్జి పి. యాదగిరి, ప్యాకల్టీ పి. శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల



కేసీఆర్‌ను కలిసిన కంచర్ల భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి)

నల్లగొండ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మాజీముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం ఆయన నివాసంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు విషయాలను చర్చించినట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

మునుగోడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ప్రభుత్వ ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆవసతి గృహం అధికారి మన్నెం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుత విద్యాసంవత్సరం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుతో పాటు విద్యార్హత ధృవీకరణ పత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరా రు. వివరాలకు 97030 98564 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కేజీబీవీలో అతిథి అధ్యాపక పోస్టులకు..

కనగల్, జూన్11:(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఈఏడాది నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతుల్లో బోధన కోసం అతిథిగా పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, సీఈసీ, ఎకనామిక్స్, కామర్స్, నర్సింగ్ 1, నర్సింగ్ 2 సబ్జెక్టులకు సంబంధించిన అభ్యర్థులు ఈనెల 12 నుంచి 14 వరకు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అలాగే ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరంలో 40 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయని ఆయా గ్రూపుల్లో చేరాలనుకునే విద్యార్థులు కూడా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

దర్వేశిపురం ఆలయ ఈవో బదిలీ

కనగల్, జూన్11 (ఆంధ్రజ్యోతి) : మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం ఈవో జయరామయ్యను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. చండూరు మం డలం తుమ్మలపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డికి దర్వేశిపురం గుడి ఇన్‌చార్జ్ ఈవోగా బాధ్యతలను అప్పగించారు. ఆలయ బ్రహ్మోత్సవాల సమయంలో ఏర్పాటుచేసి ప్లెక్సీ వివాదమే కారణమైనట్లు సమాచారం

వేణుగోపాల ఆలయంలో ఘనంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాల స్వామి దేవాలయంలో బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, సంపత్కుమార చార్యులు యజ్ఞికులుగా హోమం చేశారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ ఉత్సవంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేశ్, పసునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన

కేతేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన జరుగుతుందని కేతేపల్లి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం యానాల నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రం కేతేపల్లిలో బుధవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్, అమ్మ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలి

కట్టంగూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో కట్టంగూరులో నిర్వహించే కేవీపీఎస్ జిల్లా శిక్షణ తరగతుల కరపత్రాలను కేవీపీఎస్ మండల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, వేధింపులు పెరిగిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సీఐటీయు జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, గాదె నర్సింహా, ఒంటిపాక కృష్ణ, బొల్లు రవీందర్, దండు రవి, వంగూరి వెంకన్న, ఉడోటి నరహరి, పెరిక మల్లయ్య ఉన్నారు.

చెర్వుగట్టులో వైభవంగా మాస కల్యాణం



మాస కల్యాణం చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం పార్వతీ పరమేశ్వరులకు మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ మహామంటపంలో నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలుత ప్రధానాలయం నుంచి సన్నాయి వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను మంటపానికి చేర్చారు. దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు శ్రీకాంత్ శర్మ, సతీశ్ శర్మల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణోత్సవ తంతును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడెం అసైన్డ్ భూముల సమస్య కొలిక్కి..!

● కోర్టు కేసు ఉపసంహరణకు ముందుకొచ్చిన బాధిత లబ్ధిదారులు

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం రెవెన్యూ శివారులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సేకరించిన భూ వివాదం ఓ కొలిక్కి రానున్నది. ప్రభుత్వం ఇస్తానన్న భూ సేకరణ పరిహారం చెల్లింపుపై అసంతృప్తితో రాష్ట్ర హైకోర్టు మెట్లెక్కిన బాధిత లబ్ధిదారులు ఎట్టకేలకు ఒక మెట్టు దిగారు. ప్రభుత్వం సేకరించిన భూమికి ఎక్కువ నష్టపరిహారం కోరుతూ బాధితులు కోర్టులో వేసిన కేసు విత్‌డ్రా (ఉపసంహరణ)కు ముందుకొచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బాధిత లబ్ధిదారులకు తిరిగి పట్టాదారు పాసుపుస్తకాలు అందనున్నాయి. దీంతో పుష్కర కాలంగా కోర్టులో నానుతున్న సమస్య ఆలస్యంగానైనా పరిష్కారానికి నోచుకోనుంది.

ఇందిరమ్మ ఫేజ్-2 కోసం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ పట్టణానికి చెందిన బలహీనవర్గాల లబ్ధిదారులకు రాజీవ్ గృహకల్ప పథకం ఇందిరమ్మ ఫేజ్-2 కోసం నార్కట్‌పల్లి మండలంఎల్లారెడ్డిగూడెం రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 367, 410, 460లో అసైన్డ్ చేసిన సుమారు 69.10 ఎకరాల భూమిని ప్రభుత్వం భూ సేకరణ చేసింది. ఈ భూముల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అప్పటి గృహనిర్మాణ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 2008 నవంబర్ 17న శంకుస్థాపన చేశారు.

నష్టపరిహారంపై కోర్టుకు:

అయితే భూ సేకరణకు ప్రభుత్వం చెల్లిస్తానన్న ఎకరాకు సుమారు రూ.4 లక్షల నష్టపరిహారంపై అసంతృప్తి చెందిన బాధిత లబ్ధిదారులు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరాకు రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోర్టులో కేసు కొనసాగుతుండగానే లబ్ధిదారులతో పలువురు ఆర్డీవోలు పలు దఫాలుగా నిర్వహించిన చర్చలు ఫలించలేదు. నష్టపరిహారం విషయంలో లబ్ధిదారులు వెనక్కి తగ్గలేదు. ఫలితంగా పుష్కరకాలంగా కేసు కోర్టులో కొనసాగుతూనే ఉంది. దీంతో 69.10ల భూమిని ప్రభుత్వం నల్లగొండ ఆర్డీవో పేరిట మార్పిడి చేసింది. ఫలితంగా ఇటు పరిహారం అందక అటు రైతు బంధు కింద వచ్చే డబ్బులు కూడా అందని పరిస్థితి ఏర్పడింది.

20మందికి పైగా మృతి:

కాగా నష్టపరిహారం కేసు కోర్టులో ఇంకా కొనసాగుతుండగానే వివిధ కారణాలతో మొత్తం 68 బాధిత లబ్ధిదారుల్లో సుమారు 20 మందికి పైగా మరణించారు. వీరిలో కొందరు అంత్యక్రియలకు కూడా డబ్బులు లేని నిరుపేదలున్నారు. ఈ పరిణామంతో లబ్ధిదారుల్లో ఆలోచన, ఆందోళన మొదలైంది. ఎక్కువ నష్టపరిహారం కోసం కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. కానీ రాజకీయ జోక్యంతో కోర్టులో వేసిన కేసు ఉపసంహరణకు బాధిత లబ్ధిదారుల పక్షాన కోర్టుకు దారిచూపిన నేతలు ఇందుకు సహకరించలేదు.

న్యాయవాదికి విత్‌డ్రా నోటీసు అందజేత

కాగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి ఇచ్చిన హామీతో కోర్టులో వేసిన కేసు ఉపసంహరణకు అంగీకరిస్తూ బాధిత లబ్ధిదారులు విత్ డ్రా నోటీసుపై సంతకాలు చేశారు. కాగా ఈ కేసు వాదిస్తున్న న్యాయవాది మహ్మద్‌అలీని కాంగ్రెస్ నాయకులు బుధవారం వడ్డే భూపాల్‌రెడ్డి నేతృత్వంలో యెల్లెందుల కిట్టు, పిట్టల శంకర్, బొడ్డుపల్లి నరేశ్, దాసారపు నరేశ్ తదితరులు హైదరాబాద్‌లో కలిసి విత్‌డ్రా నోటీసు ప్రతిని అందజేశారు. త్వరగా కోర్టులో కేసు ఉపసంహరణ జరిగేలా చూడాలని కోరారు.

భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలి

● ఏఎస్పీ మౌనిక



ఏఎస్పీ మౌనిక

మర్రిగూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని, ఇందుకు పోలీసులు అవగాహన కల్పించాలని దేవరకొండ సబ్ డివిజనల్ ఏఎస్పీ మౌనిక అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు, నేరాల సంఖ్య తగ్గించడానికి కోసం గ్రామ పోలీస్ వ్యవస్థను నిఘాను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పోలీసుల పనితీరుపై సీఐ రాజు, ఎస్ఐ కృష్ణారెడ్డిలను ప్రశంసించారు.

చిట్యాలరూరల్ : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ జి. కృష్ణ, నాయబ్ తహసీల్దార్ విజయ అన్నారు. రెవెన్యూ సదస్సు చిట్యాల మండలంలోని పిట్టంపల్లిలో బుధవారం 7వ రోజు కొనసాగాయి. సదస్సులో స్థానికులు సాదాబైనామా, రెవెన్యూ రికార్డుల్లో భూమి తమ పేరిట నమోదు కాని, ఉన్న భూమి విస్తీర్ణంలో తక్కువగా నమోదైన దని, పట్టా, పేర్లు మార్పిడి కాలేదని వీటితో పాటు పలు సమస్యలపై అర్జీలు అందజేయగా వాటికి రెవెన్యూ అధికారులు రశీదులు ఇచ్చారు. పిట్టంపల్లిలో 43 అర్జీలు వచ్చాయి. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయేతర భూముల సమస్యలున్న రైతులు, హక్కుదారులు భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలనాలన్నారు. సదస్సులో సర్వేయర్ రజనీకాంత్, ఆర్ఐ జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్ రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్, దయాకర్, రాంబాబు, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.



కట్టంగూరు:పరడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో వారం రోజులుగా భూభారతి2025 చట్టం కింద అధికారులు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. వివిధ భూసంబంధిత సమస్యలపై రైతుల నుంచి వినతులను స్వీకరించారు. బుధవారం చివరి రోజు మండల కేంద్రం కేతేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 137దరఖాస్తులు అందాయని సదస్సు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మండల వ్యాప్తంగా 1137వినతులు అధికారులకు అందాయి. వీటిల్లో అధికంగా మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యుటేషన్లు, డీఎస్ పెండింగ్, వారసత్వం, కోర్టు కేసులు, భూమి ఎక్కువ, తక్కువ నమోదులకు సంబంధించినవి ఉన్నాయని అధికారులు తెలిపారు. మండల ఇన్‌ఛార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ సత్తార్ ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవిన్యూ సదస్సులను పర్యవేక్షించారు. ఆయా సదస్సుల్లో ఎంఆర్ఐ ఎన్.వెంకన్న, ఏఆర్ఐ ఎ.రామచంద్రయ్య సీనియర్ అసిస్టెంట్ జె.అర్జున్ భగవాన్, సర్వేయర్ బి.వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

కట్టంగూరు : భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ అన్నారు. బుధవారం మండలంలోని పరడ, కట్టంగూరు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. పరడ గ్రామంలో 74, కట్టంగూరులో 71 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ కుమార్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వడ్లకొండ అశోక్ తదితరులు ఉన్నారు.



కేతేపల్లి మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన



గట్టుప్పల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న లబ్ధిదారుడు

గట్టుప్పల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ వరుణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులందరూ ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏలా నిర్మించుకోవాలో తమ సలహాలు, సూచనలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గట్టుప్పల్‌లో ఇంటి నిర్మాణ పనుల భాగంగా పనులు లబ్ధిదారులతో ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ షఫీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇస్తామని మాట తప్పారు

● రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి ● మంచినీటి ట్యాంక్ ఎక్కి కార్యకర్తల నిరసన

చండూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. మంచినీటి ట్యాంక్‌పై నుంచి దూకేస్తామంటూ గంటపాటు ఆందోళన చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. చండూరుకు చెందిన మహ్మద్ ఖలీల్, దోనిపాముల గ్రామానికి చెందిన తిప్పర్తి పాండు కాంగ్రెస్ జెండా పట్టుకుని మధ్యాహ్నం సమయంలో మంచినీటి ట్యాంక్ ఎక్కారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందన్నారు. తమ నాయకుడికి మంత్రి పదవి వస్తుందన్న ఆశతో మునుగోడు కాంగ్రెస్ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేసి పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించామన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మునుగోడు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే పని చేసే నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని నినాదాలు చేశారు. గంట పాటు ట్యాంక్‌పై ఉండి ఆందోళనకు దిగటంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చచెప్పి కిందకు తీసుకొచ్చారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి

చండూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు, వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీలల చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ సూచించారు. బుధవారం మండలంలోని కస్తాల, గంగ్రపల్లి గ్రామాల్లోనిర్వహించిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కళ్యాణి, మంగమ్మ, శిరీష, పుష్పవేణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : చిన్నకాపర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అమ్మబాట-అంగన్‌వాడీ బాట నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, లింగమ్మ, హేమలతలు నీలమ్మ, ఉమ, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో సీడీపీవో సక్కుబాయి పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గుడ్డుతో వండిన బిరియానీ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బిట్టు శ్రీనివాస్ డిప్యూటీ తాహసీల్దార్ చంద్రశేఖర్, కార్యదర్శి యూసుఫ్, సూపర్ వైజర్ యశోద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : మండలంలోని అడ్లూర్, శాలిగౌరారం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్వాడీ బాట నిర్వహించారు. వ అనంతరం గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ఐసీడీస్ సూపర్ వైజర్ జ్యోతి, టీచర్స్ ఏ. పద్మ, జ్యోతి, టేకుల సంధ్య, దాసోజు కరుణ, ఏఎన్ఎం కప్పల పద్మావతి, ఆశా వర్కర్ గుణవతి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

● ప్రాంతీయ ఉద్యాన అధికారి ప్రవీణ్


శాలిగౌరారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ప్రాంతీయ ఉద్యాన అధికారి ప్రవీణ్ అన్నారు. ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో నూతనంగా సాగు చేస్తున్న వేముల రాములు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు పది వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోటలు సాగు అవుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలోని రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని, ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసి అధిక ఆదాయం పొందాలని కోరారు. ఆయిల్ పామ్ పంటకు కూలీ ఖర్చులు తక్కువని, కోతుల, దొంగల బెడద ఉండదని అన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే విక్రయస్తారని, దళారుల ప్రమేయం ఉండదని అన్నారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ మేనేజర్ నర్రా రవీందర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ నరేందర్, పతంజలి క్షేత్ర సహాయకులు కట్టగూరి రాము, రైతు వేముల రాములు, ఇంద్రకంటి నరేష్, రమేష్ పాల్గొన్నారు

ఎమ్మెల్యే సామేల్ ప్రతిష్టను దెబ్బతీయడానికే ఆరోపణలు

శాలిగౌరారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు ప్రతిష్టను దెబ్బతీయడానికే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలంగాణ స్టూడెంట్స్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు అన్నారు. బుధవారం రాంబాబు శాలిగౌరారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సామేలు పేదరికంలో పుట్టి ఎన్నో అటుపోట్లకు గురై నేడు ప్రజల మనిషిగా ఎదిగాడన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరకొండ మస్తాన్, జిల్లా అధ్యక్షులు బొబ్బిలి జానీ యాదవ్, నాయకులు దేవరకొండ శంకర్, శానాల రవీందర్ రెడ్డి, దేవరకొండ సందీప్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా కాశయ్య

శాలిగౌరారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా రావుల కాశయ్య బాధ్యతలు చేపట్టారు. నకిరేకల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ యాదగిరి ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేశారు. యాదగిరి నుంచి కాశయ్య బాధ్యతలు స్వీకరించారు.



చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	22.0

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

● యాదాద్రి జిల్లా గుండాల మండలంలో నిందితులను పట్టుకున్న పోలీసులు

6



సెలవులకు టాటా.. నేటి నుంచి బడిబాట





- పాఠశాలలను శుభ్రంచేసి సిద్ధం చేసిన ఉపాధ్యాయులు
- విద్యార్థుల నమోదుకు 'బడి బాట' నిర్వహణ
- ప్రైవేటులో తల్లిదండ్రులకు ఫీజుల తంటా
- అందని బీఏఎస్ నిధులు

వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాసంస్థలను శుభ్రంచేసి సర్వం సిద్ధం చేశాయి. పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించేందుకు మామిడి తోరణాలు, బెలూన్స్‌తో అలంకరించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, కోదాడ, సూర్యాపేటఅర్బన్, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,376 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 2,355, ప్రాథమికోన్నత 290, ఉన్నత పాఠశాలలు 631 ఉన్నాయి. ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 150, ప్రాథమికోన్నత 400, ఉన్నత పాఠశాలలు 550 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 4.5లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 481, ప్రాథమికోన్నత 68, ఉన్నత పాఠశాలలు 163 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 3,465 ఉపాధ్యాయ పోస్టులకు 3,315మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 150 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,693మంది ఎస్జీటీలు, 1,784 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. 160 మంది జీహెచ్‌ఎంలు, 150మంది ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో సుమారు 1,484 ప్రభుత్వ,350 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.ఎక్కువమంది విద్యార్థులు ఉండి తక్కువమంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలకు తక్కువమంది విద్యార్థులు ఉండి ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేయనున్నారు.

విద్యార్థుల సంఖ్య, ప్రమాణాలు పెంచేందుకు

ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుండటంపై అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థుల నమోదుకు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా గత ఏడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచితే ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కూడా పూర్తయింది. మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు పాఠశాలల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు తాజాగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, స్కావెంజర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలలకు నూరుశాతం యూనిఫాం,పుస్తకాలు, నోట్ బుక్స్ చేరగా,వాటిని పాఠశాలల పునఃప్రారంభం రోజే పంపిణీచేయనున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 5,89,970 పుస్తకాలు పాఠశాలలకు చేరాయి. గత విద్యా సంవత్సరంలో చదువులో వెనుకబాటుతనాన్ని గుర్తించిన ప్రభుత్వం, ఈ విద్యా సంవత్సరంలో దా న్ని అధిగమించేందుకు 60రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనుంది. చదవడం, రాయడంలో సామర్థ్యాల పెంపు, ప్రతీ రోజు సాయంత్రం పాఠశాల ముగియగానే గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

సమస్యల తిష్ట

సూరాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2లో తరగతి గదుల్లో సరైన వెలుతురు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చివ్వెంల మండలంలోని తిమ్మాపురం, వల్లభాపురం, గుంజలూరు ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. నూ తనకల్ మండలంలోని తాళ్ల సింగారం, పెద్దనెమిల, మద్దిరా ల మండలంలోని గోరెంట్ల, చిననెమిల ప్రాథమిక పాఠశాల లు అధ్వానంగా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్), కోదాడ నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు లేవు. మరికొన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ

మిగతా 7వ పేజీలో..



తల్లిదండ్రులకు ఫీజుల తంటా

తల్లిదండ్రులు కుటుంబ బడ్జెట్‌లో ఎక్కువ భాగం పిల్లల చదువుకోసం ఖర్చు చేసే పరిస్థితి ఉంది. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు, షూ, ట్రంక్‌పెట్టెలు ఇప్పటికే తీసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజులు నిర్ణయించాయి. ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు, షూ ధరలు ఏటా పెరుగుతుండటంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. కార్పొరేట్ పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థిపై రూ.1.25లక్షలు, బడ్జెట్ పాఠశాలల్లో రూ.50వేలు, హాస్టల్‌కు అదనంగా మరో రూ.50వేల వరకు ఖర్చు వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బస్సుల ఫిట్‌నెస్ ఎంత?

ఉమ్మడి జిల్లాలో సుమారు 900 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఆయా పాఠశాలలు సుమారు 674 బస్సులు నడుపుతున్నాయి. అందులో 30శాతం బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండగా, 25శాతం పాఠశాలలకు మాత్రమే అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్ ఉన్నట్లు సమాచారం. పాఠశాల బస్సులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. వాటిని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాటించాల్సి ఉంది. అయితే ఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పూర్తి కాని 'మన ఊరు, మన బడి' పనులు

గత ప్రభుత్వం 'మన ఊరు, మన బడి' కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించింది. మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణాలు పూర్తయినా, నిధులు విడుదల కాకపోవడంతో ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్,పెయింటింగ్ పనులు నిలిచాయి. యాదాద్రి జిల్లాలో గత ఏడాది 'అమ్మ ఆదర్శ పాఠశాల' కింద జిల్లాలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించగా, ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు కొన్ని ఇబ్బందులు తప్పనున్నాయి. గతఏడాది జిల్లాకు రూ.25కోట్లు మంజూరు చేసింది. వీటితో 3,192 పనులు నిర్వహించారు. మైనర్ రిపేర్లకు 651పనులు, తాగునీటికి పను లు 472, విద్యుత్ సంబంధిత పనులు 754, మరుగుదొడ్ల మరమ్మతులు 1,251, నూతనంగా బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణాలు 58 వరకు చేపట్టారు. ఇంకా కొన్ని పనులకు పాఠశాలల నుంచి రూ.3కోట్ల వరకు ప్రతిపాదనలు విద్యాశాఖకు రాగా,నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించింది.





మూడో శనివారం ఉండదు భారం

- పాఠశాలల్లో నోబ్యాగ్‌డే
- విద్యార్థులకు ఊరట

విద్యార్థులకు పుస్తకాల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో నో బ్యాగ్‌డే అమలుకు నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా మూడో శనివారం నోబ్యాగ్‌డేను అమలుచేయనుంది.

7 - (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

బాలకార్మిక వ్యవస్థ సజీవంగానే..

- శ్రమ దోపిడీకి గురవుతున్న చిన్నారులు
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం



కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పలువురు చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తున్నా బాలకార్మిక వ్యవస్థ సజీవంగానే ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 20వేల మందికి పైగా బాలకార్మికులు ఉన్నట్లు ఓ అనధికార అంచనా. ఈ వ్యవస్థను సమూలంగా రూపుమాపాలని పలువురు విద్యా నిపుణులు కోరుతున్నారు.

6 - (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పోచంపల్లికి నేడు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



పోచంపల్లిలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి,జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల తయారీ కేంద్రం భూదాన్‌పోచంపల్లిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం సందర్శించనున్నారు. గవర్నర్ ఇక్కడి టూరిజం పార్క్‌ను సందర్శించి 30 మంది చేనేత కార్మికులు, కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతతో ముఖాముఖి నిర్వహిస్తారు. చేనేత కార్మికుల గృహాలను సైతం సందర్శించి మగ్గాలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకుంటారు.

గవర్నర్ పర్యటన ఇలా..

ఉదయం 10.30 గంటలకు పోచంపల్లి చేరుకుంటారు. 11 గంటల వరకు పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శిస్తారు. 11.15 గంటల నుంచి 11.45 వరకు చేనేత కార్మికులు, కళాకారులకు టూరిజం పార్క్‌లో ముఖాముఖి నిర్వహిస్తారు. 12 గంటల వరకు అక్కడే చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. అనంతరం లబ్ధిదారులకు 'నేతన్న బీమా' చెక్కులను పంపిణీ చేస్తారు.

రైతులు రశీదు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



నార్కట్‌పల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విధిగా రశీదు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులను డీలర్లు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డీలర్ల వద్ద రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట ఏవో గౌతమ్ ఉన్నారు.

టీజీఎండీసీ ద్వారానే ఇసుక సరఫరా

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ద్వారానే సరఫరా చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు,ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనుల వారీగా సంబంధితశాఖల ఇంజనీరింగ్ అధికారులు జాబితాలను సమర్పించాలన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ఇకపై టీజీఎండీసీ ద్వారా మాత్రమే సరఫరా చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుంచి నేరుగా ఇసుకను తీసుకోవద్దని, అవసరమైన ఇసుకకు ముందే అనుమతులు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా ఇసుక లభ్యమయ్యే వనరులను మైనింగ్‌శాఖ జాబితా సమర్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎంత ఇసుక అవసరమో అంతే వినియోగించాలని, పరిమితికి మించి ఇసుకను వినియోగించవద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, జిల్లా మైనింగ్ అధికారి శామ్యూల్ జాకబ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ రాజ్‌కుమార్, ఇరిగేషన్ అధికారి నాగార్జున, వైటీపీఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి అంగన్‌వాడీ-1 కేంద్రంలో చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


కబ్జాలో ఉన్నా ప్రభుత్వ భూముల పట్టా కుదరదు

నార్కట్‌పల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కబ్జాలో ఉన్నంత మాత్రాన ప్రభుత్వ భూమిని పట్టా చేయడం కుదరదని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా, విక్రయించినా నేరమన్నారు. బుధవారం మండలంలోని ఏపీలింగోటంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే గ్రామంలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు స్థలం కొరత ఏర్పడి గ్రామస్థులే నష్టపోతారని చెప్పారు. శాలిగౌరారం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి స్థలం దొరకని పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ ఉదహరించారు. పైసా ఖర్చులేకుండా భూ వివాదాలను పరిష్కరించుకునే వేదికగా భూ భారతి చట్టం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకొని వాటికి సమాధానం చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, రెవెన్యూ ఉద్యోగులు యాదయ్య, దొడ్డి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

గ్రామాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1 కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. 'అమ్మ మాట, అంగన్‌వాడీ బాట'లో భాగంగా చిన్నారుల నమోదును పరిశీలించారు. కేంద్రంలోని చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారితో పద్యాలు (రైమ్స్) చదివించి చాక్లెట్లు అందజేసి చిన్నారులతో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగానే బడిగంటను మోగించి బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడ్డుతోకూడిన బిర్యానీ అందజేసే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకొని ప్రతి నెలా క్రమం తప్పకుండా పీహెచ్‌సీల్లో నిర్వహించే ఏఎన్‌సీలకు వెళ్లాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్‌డబ్ల్యూవో కృష్ణవేణి, ఐసీడీఎస్ సీడీపీవో అస్రఅంజుమ్, ఎంపీవో సుధాకర్, సూపర్‌వైజర్ సరిత, అంజమ్మ, ఏఎన్‌ఎం నాగమణి, తదితరులు ఉన్నారు.

'భూభారతి'తో భూసమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వేములపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'భూభారతి' చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున, రైతులు భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మొల్కపట్నం గ్రామంలో 61 దరఖాస్తులు అందాయని, మండల వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 493 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని, ఈ నెల 20వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో విచారించి 13-బీ జారీ చేస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, డీటీ కోటేశ్వరి, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, జూనియర్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.



7

ప్రజాప్రభుత్వంలోనే అన్నివర్గాలకు న్యాయం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్

నల్లగొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కింద ఈ ఏడాది జిల్లాలో 68,70,800 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 39,51,700 మొక్కలు, వ్యవసాయశాఖ 7.66లక్షలు, ఉద్యానశాఖ 6.38లక్షలు, మున్సిపాలిటీలు 8.20లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అధికారులు వారి లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ, వనమహోత్సవం మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించడమేగాక జియో ట్యాగింగ్ చేయాలని, నర్సరీలను మ్యాచింగ్, బ్యాచింగ్ చేయాలని, ప్రముఖులు మొక్కలు నాటేందుకు ఒక వీఐపీ స్థలాన్ని గుర్తించాలన్నారు. మొక్కలు నాటే విషయంలో సాంకేతికత, సూచనలను అటవీశాఖ ఎప్పటికప్పుడు అందిస్తుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి శ్రవణ్, ఎక్సైజ్ అధికారి సంతోష్, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మెనూను సక్రమంగా అమలు చేయాలి

డీటీడీవో ఛత్రునాయక్



వసతి గృహంలోని వంట గదిని పరిశీలిస్తున్న డీటీడీవో ఛత్రునాయక్

పెద్దవూర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో భోజన మెనూను సక్రమంగా అమలు చేయాలని డీటీడీవో ఛత్రునాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, ఎస్సీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతిగృహంలోని వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా సిబ్బంది పాఠశాలను, వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్టళ్లలో వసతి పొందేందుకు విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● ఏరువాక సాగారో..



జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏరువాక పౌర్ణమిని రైతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లిలో కొందరు రైతులు పత్తి విత్తనాలు విత్తారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

పెద్దఅడిశర్లపల్లి,చింతపల్లి జూన్11(ఆంధ్రజ్యోతి):పీఏపల్లి, చింతపల్లి కస్తూర్బా బాలికల కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఎంపీహెచ్‌డబ్ల్యూలో బోధించుటకు మహిళా అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటయ్య, ప్రత్యేక అధికారి వాసవీ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పీజీ.బీఈడీ అర్హత కలిగి ఉం డాలన్నారు.ఎంపీహెచ్‌డబ్ల్యూ కోసం ఎమ్ఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి ఉండాలని సూచించారు. వివరాలకు కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

చదువుపై శ్రద్ధ వహించాలి : డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. ఆల్ మదీనా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని లోటస్ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.విద్యార్థులు శ్రేయస్సుకై ఉచిత శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి వరప్రసాద్, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ ఖాజాహమీదుద్దీన్ పాల్గొన్నారు.

రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు

- వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌తో మునిసిపాలిటీలో సమస్యలన్నీ పరిష్కారం
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో దేవరకొండ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వందరోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలన్నీపరిష్కారమవుతాయని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. ఇప్పటికే పట్టణంలో రూ.60 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులు 20 వార్డులకు మంజూరైనట్లు తెలిపారు. వానాకాలం నేపథ్యంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కాలువల పూడికతీత పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో బుధవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలు నేరుగా కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించారు.


ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్ సుదర్శన్

ఇరగదిండ్ల రవి, 18వ వార్డు
మా కాలనీలో రోడ్లు గుంతలమయమయ్యాయి, చెత్తను తొలగించడంలేదు
కమిషనర్: రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే చేతులమీదుగా త్వరలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తాం. కాలనీలో చెత్తను వెంటనే తొలగించడానికి చర్యలు చేపడుతాం.

వస్కుల సుధాకర్, 3వ వార్డు : డ్రైనేజీ పూడుకుపోయి దుర్వాసన వస్తోంది..?
కమిషనర్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా డ్రైనేజీల పూడికతీత పనులు చేపడుతాం. దీంతో సమస్య పరిష్కారం అవుతుంది.

సైదులు, 14వ వార్డు : కాలువలు శుభ్రపరచడం లేదు, దోమల బెడదతో ఇబ్బందులుపడుతున్నాం
కమిషనర్: కాలువలను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. చెత్త, చెదారం తొలగించి దోమల బెడద అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహిస్తాం.

చంద్రశేఖర్ 20వ వార్డు : పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం:
కమిషనర్: పందుల యజమానులకు నోటీసులు జారీ చేసి పందుల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో పందుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తా.

మహమ్మద్ అలీం, 13వ వార్డు : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు
కమిషనర్: అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

చిత్రం ఉదయ్, 4వ వార్డు : కాలనీలకు సరిపడా కృష్ణాజలాలు రాక ఇబ్బందులుపడుతున్నాం
కమిషనర్: సాంకేతిక కారణాలతో కృష్ణాజలాల సరఫరా తరచుగా అంతరాయం జరుగుతుంది. దీంతో కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 4వ వార్డుకు కృష్ణాజలాలు సరిపడా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

గుండాల అంజయ్య యాదవ్, 1వ వార్డు : సమీకృత మార్కెట్‌ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు :
కమిషనర్: దేవరకొండలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు స్థలాన్ని సేకరిస్తున్నాం.

కలారి శ్రీకాంత్, 2వ వార్డు : కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం:
కమిషనర్: కోతుల బెడదను అరికట్టేందుకు ఇటీవల కోతులను పట్టేవారిని రప్పించి వెయ్యి కోతుల వరకు పట్టి శ్రీశైలం అడవుల్లో వదిలేశాం. మిగతా కోతులను కూడ పట్టుకొని సమస్యను పరిష్కరిస్తాం.

ముకురాల గణేష్, 10వ వార్డు : నాలుగు రోజులకు ఒకసారి కృష్ణాజలాలు సరఫరా అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాం:
కమిషనర్: కృష్ణాజలాలు రోజు విడిచి రోజు కాలనీలకు అందేలా చర్యలు తీసుకుంటాం. అన్ని కాలనీలకు సరిపడా కృష్ణాజలాలు సరఫరా చేస్తాం.

మిర్యాలగూడ కీర్తి విస్తరించాలి


సాయిఠాగూర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ కీర్తి ఖండాంతరాలకు విస్తరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జేఈఈ ఫలితాల్లో ఆలిండియా 29వ ర్యాంకు సాధించిన పట్టణ విద్యార్థి బానావత్ సాయిఠాగూర్‌ను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ విద్యార్థులు దేశం లోని ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశాలు పొందడం హర్షణీయమన్నారు. ఆయా విద్యాలయాల్లో అందించే ప్రపంచస్థాయి బోధనను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకుని పట్టణానికి విశ్వవ్యాప్త గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కైలాబ్‌నాయక్, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

థైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

దామరచర్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ది థైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ యూనైటెడ్ నల్లగొండ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏడుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ముగ్గురు సిల్వర్ మెడల్స్, ఒకరికి బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అభినందించారు. విద్యార్థులు ఇలాంటి పతకాలెన్నో సాధించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

దేవరకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలు పెంచడం వల్ల 10 లక్షలకు పైగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు భారం పడుతోందన్నారు. బస్‌పాస్ చార్జీలను నెల కు రూ.400 నుంచి 600 పెంచారని వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ కార్యదర్శి వడ్డెపు శివకుమార్ పల్లె కిరణ్, అప్రోజ్, అరవింద్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

నాగార్జునసాగర్,జూన్11(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సత్యనారాయణ స్వామి ఆలయ 51వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతాల్లో 20 మంది దంపతులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ పేర్కొన్నది సాయంత్రం దివ్య వైభవ ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలోఅర్చకులు రాధయ్య, రామానుజం, వెంకటాచార్యులు, భక్తులు కిశోర్, పద్మ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

'డీ ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలి'

చందంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన రైతులకు డీ ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం సర్కిల్‌తండాలో భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫారెస్ట్ భూమిని చదును చేసుకొని జీవనాధారంగా బ్రతుకుతున్న గిరిజన రైతులకు పట్టాలు అందజేయాలని, 2006 అటవి హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పాపనాయక్, రామోజి, మోతీలాల్, శీను పాల్గొన్నారు.

రఘువీర్ నియామకంపై హర్షం

మిర్యాలగూడ టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి నియామకం పై కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల కుటుంబం నుంచి వచ్చిన రఘువీర్ రికార్డు స్థాయి మెజారిటీతో పార్లమెంట్ మెంబరుగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అశేష ప్రజాభిమానం గల రఘువీర్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే మునిసిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య ఎంపీ రఘువీర్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాలలో కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, వీరన్న, నాగేంద్రబాబు, నర్సింహ, శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, అధికారులతో బుధవారం తన నివాసంలో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. తొలివిడతలో ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను కోరారు. భూయజమాన్య హక్కులు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిర సౌరగిరి జలవికాసం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకే సౌరగిరి జల వికాసం పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 93 మంది లబ్ధిదారులకు పథకం ద్వారా సోలార్ పంపుసెట్లు పంపిణీ చేస్తామన్నారు. విద్యుత్ అవసరం లేకుండా స్వయంగా ఆదాయాన్ని పెంచుకోవడానికే ప్రభుత్వం ఇందిర సౌరజల వికాసం పథకాన్ని అమలు చేస్తుందన్నారు. సమావేశంలో హౌజింగ్ డీఈ నాగేందర్, శక్రునాయక్, దేవరకొండ మున్సిపల్ కమీషనర్ సుదర్శన్ పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో భూములకు భద్రత


దిలావర్‌పూర్ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

దామరచర్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో బుధవారం భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టంతో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ధరణి స్థానంలో కొత్త చట్టం తీసుకొస్తామని చెప్పి కేవలం ఏడాది కాలంలోనే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణి వ్యవస్థ వల్ల అనేక అక్రమాలు జరిగాయని, రైతులకు న్యాయం జరగలేదని అన్నారు. కానీ ఇప్పుడు భూభారతితో అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు నేరుగా వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులను తీసుకుంటున్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● చింతపల్లి : మండల కేంద్రం, ఉమ్మాపుర్‌లో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 88 దరఖాస్తు లు లబ్ధిదారులు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ డీటీ హర్షద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

హాలియా, జూన్11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైనభోజనం అందించాలని అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మ ధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశుభ్రతపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రభుత్వం సరఫరా చేసే సన్నబియ్యంతో వండాలని, వారానికి మూడు గుడ్లు, మూడు రోజులు జావ తప్పని సరిగా అందించాలన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా విధిగా పాఠశాలకు ఉదయం 7 గంటలకు హాజరై సాయంత్రం వరకు ఉండి పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. శిక్షణ అర్థవంతంగా ఉండడానికి ఐఎఫ్‌బీ ప్యానెల్‌పై తగిన వీడియోలతో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రకా ష్, దాస వెంకన్న, ఆర్పీలు ప్రసాద్, మణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్) : వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యం లో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యాశాఖాధికారి పరిధిలో 88 పాఠశాలలుండగా, అందులో 61 ప్రాథమిక, 13 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఇక ఉన్నత పాఠశాలలు 14 ఉండగా గతేడాది చివరి నాటికి సర్కారు బడలలో నమోదైన విద్యార్థుల సంఖ్య 5,898గా ఉంది.



: పీఏపల్లి : పాఠ్యపుస్తకాలు తీసుకెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు

వాడవాడలా బడిబాట

ప్రభుత్వ బడుల బలోపేతానికి చర్యలు చేపట్టారు విద్యాశాఖ అధికారులు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గర్ల్స్ హైస్కూల్, బకల్‌వాడీ, షాబునగర్, గాంధీ పార్కు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఎనోరోల్‌మెంట్ తక్కువగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. పుస్తకాలు, యూనిఫామ్స్ ఉచితంగా అందించడంతో పాటు విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును వివరిస్తున్నారు.

యూనిఫామ్స్ అదిరేలా.. పాఠం అర్థమయ్యేలా..

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని మొత్తం 45 ప్రభుత్వ పాఠశాలల్లో 1,426 మంది విద్యార్థులు ఉన్నారు. యూనిఫామ్స్‌ను కుట్టే బాధ్యతను స్వశక్తి సంఘాల మహిళలకు అప్పగించారు. పీఏపల్లి, అజ్మాపురం కుట్టు కేంద్రాల పరిధిలో దాదాపు 50 మంది మహిళలు యూనిఫామ్స్ కుడుతున్నారు. గతంలో పంపిణీ చేసిన యూనిఫామ్స్ కొలతలు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు వేసవి సెలవులకు ముందుగానే స్వశక్తి మహిళలతో విద్యార్థుల కొలతలు సేకరించారు.ప్రస్తుతం మొదటి దశలో 1,426 మందికి ఒక జత యూనిఫామ్స్ కుట్టు పనులు పూర్తికావడంతో ఐకేపీ ప్రతినిధులు ఆయా పాఠశాలకు దుస్తులు అందించారు. రెండో జతను ఆగస్టు 15న పంపిణీ చేయనున్నారు.

పాఠ్యపుస్తకాలు సరఫరా..

పీఏపల్లి ఎమ్మార్సీ నుంచి ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. మొత్తం పాఠ్యపుస్తకాలు 8900 అవసరం కాగా ప్రస్తుతం 8000 పాఠ్యపుస్తకాలు అందించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు ఒకే పుస్తకంలో తెలుగు, ఇంగ్లిష్ ద్విబాషా పుస్తకాలు ముద్రించారు. ఇప్పటికే ఒక్కో విద్యార్థికి ఆరు చొప్పున మొత్తం 8000 పాఠశాలలకు అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలి : డీఆర్‌డీఓ

గుర్రంపోడు జూన్ 11 (ఆంధ్రజ్యోతి) మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. బుదవారం మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంఘబంధంలో కొత్తగా కమిటీ సభ్యులను ఎన్నుకుని వారికి మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో చర్చించిన అంశాలను తీర్మాణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, ఏపీఎం రామలింగయ్య, యాదయ్య, సీసీ రాజేశ్వరి, సంఘబంధం సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి : సీపీఎం

దామరచర్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులు, పురుగు మందులను అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు, వ్యవసాయాధికారులకు వినతిపత్రం అందచేసి వారు మాట్లాడారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోయి ఆర్థికంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. అధికారులు నకిలీ విత్తనాలను విక్రయించే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాపానాయక్, దయానంద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సమతుల ఆహారం

డిండి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో వారంలో మూడు రోజులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల ఆహారం అందజేస్తున్నట్లు సూపర్‌వైజర్ రేణుక తెలిపారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని ఎడ్లగడ్డతండాలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ, పాల్గొన్నారు.

● చింతపల్లి, చందంపేట, అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, వేముపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)లోని 1, 2, గొడకొండ్ల, పోలేపల్లిరాంనగర్ అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు బుధవారం అమ్మఒడి-అంగన్వాడీ బడిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు బాదేపల్లి స్వప్న, పారిజాత, యాదమ్మ, శారద, పాల్గొన్నారు. చందంపేట మండలం హంక్యతండా గ్రామంలో నిర్వహించిన అమ్మమాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న చంద్రకళ, పార్వతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. కొండమల్లేపల్లి మండల అంగన్‌వాడీ సెక్టార్‌లో అమ్మమాట అంగన్‌వాడి మాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఖతీజా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సరళ, అంగన్‌వాడి టీచర్లు శోభ, జ్యోతి, అంగన్‌వాడి పాల్గొన్నారు. అడవిదేవులపల్లి, మండలం ఉల్సాయిపాలెం అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో అమ్మమాట- అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్.నాగరాణి అంగన్‌వాడి టీచర్ శిరీష, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. వేములపల్లి మండల కేంద్రంలోని ఎస్ఎస్సీ కాలనీలో అమ్మ మాట- అంగన్‌వాడి బడిబాట కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ పాల్గొని ఎగ్ బిర్యాని ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు.


వేముపల్లి : చిన్నారులు, తల్లులకు ఎగ్ బిర్యాని కార్యక్రమాన్ని ప్రారంభించి బిర్యాని అందచేసిన సీడీపీవో చంద్రకళ

కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమి రజిని, నాయకులు మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, రేగట్టె రవీందర్‌రెడ్డి, నార్లకంటి సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, అంగన్‌వాడి టీచర్లు శోభారాణి, రోజా, జయమ్మ, శశికళ, రజిత, నిర్మల, పాల్గొన్నారు.

యూనిఫామ్ పంపిణీ

మాడ్గులపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాములపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం స్కూల్ యూనిఫామ్‌లను ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీ పుట్టల నాగయ్య, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, దుర్గం లక్ష్మీ, మణెమ్మ పాల్గొన్నారు.

పశువైద్య డాక్టర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం

తిరుమలగిరి(సాగర్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): పశువైద్య కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉండి వైద్యం చేయాల్సిన డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని బుధవారం పశువైద్య కేంద్రాన్ని సీపీఎం మండల సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య ఆధ్వర్యంలో వెళ్లి వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉండాల్సిన మండల పశువైద్యాధికారి, వీఎల్‌వో విధుల్లో లేకపోవడంతో సంబంధిత డాక్టర్‌ను వారు ఫోన్‌లో సంప్రదించగా తాను మీటింగ్‌కు వెళ్తున్నట్లు చెప్పాడని అన్నారు. అలాగే వీఎల్‌వో ఆసుపత్రిలో లేరని అడగగా అతను సెలవు పెట్టాడని చెప్పినట్లు తెలిపారు. కానీ తదనంతరం వీఎల్‌వోకు ఫోన్ చేసి మాట్లాడగా తాను డాక్టర్ ఇద్దరం కలిసి మీటింగ్‌కు వెళ్తున్నామని పేర్కొన్నారని తెలిపారు. ఈ విధంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడం వల్లనే కొద్ది రోజుల క్రితం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారి వెంట నల్లబెల్లి జగదీష్, చాంద్‌పాషా, బాషా, గోపి తదితరులు ఉన్నారు.

రామచంద్రారెడ్డికి నివాళి

హాలియా,జూన్11(ఆంధ్రజ్యోతి):మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం నర్సిరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన పార్థివ దేహానికి ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పాశం రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా,జూన్11(ఆంధ్రజ్యోతి): 32 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే హాలియా 33 కేవీ లైన్ మరమ్మతు కారణం గురువారం హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ధన్‌రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు హాలియా, అనుముల, అనుములవారిగూడెం, ఈశ్వర్‌నగర్, కొత్తపల్లి, నాయుడుపాలెం, ఇబ్రహీంపేట గ్రామాల్లో అంత రాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలి

కొండమల్లేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న నిర్వహించే జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని చింతకుంట్ల గ్రామంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.మండల అధ్యక్షుడు ఎల్లయ్యమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షలు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు పోలేని యాదన్నమాదిగ, కొమిరె స్వామి, నల్లా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

దామరచర్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దామరచర్లలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి వారు మాట్లాడారు. పాఠశాల భవన నిర్మాణ పనులు ఇప్పటివరకు 10శాతం కూడా పూర్తి కాలేదన్నారు. అద్దె భవనంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయులు ధనావత్ శ్రీనునాయక్, శ్రీనునాయక్, నరేష్‌నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.